క్లుప్తంగా

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న కావలి విజయదుర్గ పీఠం సంస్థానాధీశులు

నరసన్నపేట: స్థానిక భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామికి నెల్లూరు జిల్లా కావలి విజయదుర్గ పీఠం సంస్థానాధీశులు వీరబ్రహ్మయ్య స్వామిజీ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణశిలతో ఈ ఆలయం పునర్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక దాతలు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం విశ్వబ్రాహ్మణ స్వర్ణకార భవనంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ నిర్మాణ శిల్పాచార్యులు బాలసుబ్రహ్మణ్యం పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు చౌతా షణ్ముఖరావు, అర్చకులు దుర్గామల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ డబ్బాల పంపిణీ



చెత్త సేకరణ డబ్బాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

నరసన్నపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం బాగుంటుందని వీఎన్‌పురం సర్పంచ్ పుట్టా ఆదిలక్ష్మి అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం భాగంగా వీఎన్ పురం పంచాయతీకి 600 చెత్త డబ్బాలు మంజూరు కాగా.. గోక్కయ్యవలసలో వీటి పంపిణీని శనివారం ప్రారంభించారు. ఈ డబ్బాలో చెత్తను వేసి గ్రీన్ అంబాసిడార్లు వచ్చినప్పుడు ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి సహకరించాలన్నారు.

రూ.6 లక్షలతో రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని స్టేట్ బ్యాంకు వీధి కూడలి నుంచి జోగిపేట వరకు రహదారి పనులు శనివారం చేపట్టారు. గత ప్రభుత్వం, పంచాయతీ పాలకవర్గం ఈ రోడ్డును పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. వర్షం పడితే నీరు రోడ్డుపై ప్రవహించి కాలువను తలపించేది. మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఇది ఒకటి. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీటీ నేతింటి రాజేశ్వరరావు, వార్డు సభ్యుడు బీఎల్ శర్మ రోడ్డు పనులు పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



యండ భవ్యశ్రీ

నరుబుజ్జిలి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యండ భవ్యశ్రీ సూచించారు. ఆస్పత్రిలో శనివారం వైద్య సిబ్బందితో మాట్లాడారు. వర్షాలతో కొత్తనీరు వస్తున్నందున ప్రతీ ఒక్కరు నీటి కాచిచల్లార్చి తాగాలన్నారు. అలాగే ఆరుబయట ఉన్న తినుబండారులను తీసుకోవద్దన్నారు. ఇంటి ముందు చెత్త, కొబ్బరిబొండాలు ఉండకుండా చూడాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సింహాచలం

నరసన్నపేట: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ విధిగా ఆర్‌టీఏ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సింహాచలం సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని, జరిమానా వేస్తామని హెచ్చరించారు.

• ముంపులోనే పొలాలు

సరుబుజ్జిలి: ఎగువ ప్రాంతాల నుంచి అధికంగా వరదనీరు రావడంతో మండలంలోని తురకపేట, కె.జె.పేట, బుడ్డివలసలోని తట్టు ప్రాంత భూములు ఇంకా ముంపు బారిలోనే ఉన్నాయి. కాలువలో గుర్రపు డెక్క ఎక్కడికక్కడే నిల్వ కావడంతో వరదనీరు కిందికి వెళ్లడంలేదు. దీంతో పంట పొలాల్లో వరదనీరు కిందకు వెళ్లడం లేదని రైతులు తెలిపారు. లేత దశలో ఉన్న వరినారు కుళ్లిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తురకపేట వద్ద పొలాల్లో నిల్వ ఉన్న వరదనీరు

• చెరువులకు జలకళ



వర్షం నీటితో నిండిన సత్యవరం కూడలిలోని సుసరాం చెరువు

నరసన్నపేట: మండలంలోని చెరువులు నిండు కుండల్లా కనిపిస్తున్నాయి. ప్రతీ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసే వర్షాలకు నిండే చెరువులు ఈ ఏడాది ముందుగానే నిండాయి. ఖరీఫ్ సీజన్‌కు ఈ ఏడాది ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రమాదాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని, ఈత రాని వారు చెరువుల్లో దిగవద్దని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హెచ్చరిస్తున్నారు.



పైడితల్లి ఆలయం సమీపంలోని లచ్చుమన్న చెరువుకు జలకళ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- గడప గడపకు మన ప్రభుత్వంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలసరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే దీనికి నిదర్శనమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తురకపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అంటే ప్రజలకు ధీమా అని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రతీ ఇంట్లోనూ ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరా తీసి అక్కడిక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతతంగా అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ మామిడి దమయంతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మామిడి ఢిల్లేశ్వరరావు, కూటికుప్పల సన్యాసిరావు, తిర్లంగి రామారావు, చిలకలపల్లి సురేష్, గురుగుబెల్లి చలపతిరావు, మెట్ట వసంతరావు, తమ్మినేని వేణు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ట్రాన్స్‌కో ఏఈ బి.రవికుమార్, జేఈ చంద్రమౌళి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'కలమట' ఆరోపణలు అర్థరహితం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- మాజీ ఎమ్మెల్యే వెంకటరణకు ప్రజలే బుద్ధిచెబుతారు..
- జగనన్న సురక్ష కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రానున్న ఎన్నికల్లో కలటమకు ప్రజలే రాజకీయ సమాధి చేస్తారన్నారు. మండలంలోని నేరడి, ఓండ్రుజోల గ్రామ సచివాలయాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సరక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కలమట తనపై వ్యక్తిగత దూషణలు చేసినంత మాత్రాన ఆయనకు ప్రజలు ఓట్లు వేయరన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సీఎం వైస్ జగన్‌కు రెండోసారి ప్రజలు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కలమట, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహనాయుడుతోపాటు ఆ పార్టీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో ప్రజా ధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. నేడు సీఎం జగన్.. అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. 2014లో వైఎస్సార్‌సీపీ జెండాతో ఎమ్మెల్యేగా గెలిచిన కలమట.. అప్పట్లో టీడీపీ ఇచ్చిన కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయారన్నారు. సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీ నాయకులను కలమట విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. గత చరిత్ర మరిచిపోయి మాట్లాడటం సరికాదన్నారు. టీడీపీ తరపున కలమట ఈ జన్మలో ఎమ్మెల్యేగా గెలవలేరన్నారు. ఎన్నికలు సమీపించడంతో టీడీపీ నాయకులు అబద్ధాలు చెప్పేందుకు గ్రామాలకు వస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ పావని, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ గంధవరపు ఈశ్వరి, ఉప సర్పంచ్ చింతాడ వెంకట సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, కామక త్రినాధరావు, కుంచాల రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

డొంకలబడవంజలో భూసర్వే ప్రారంభం



రైతులతో మాట్లాడుతున్న మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో భూముల రీసర్వేను శనివారం ప్రారంభించారు. గ్రామంలోని సాగరం చెరువులో ఐదు దశాబ్దాల క్రితం ఓ వ్యక్తికి 6.52 ఎకరాల భూమిని డీ పట్టా ఇవ్వటంతో రైతులు గేదెల ప్రభాకరనాయుడు, సత్యనారాయణ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులందరూ భూ సర్వేను వ్యతిరేకించారు. పంట పొలాలకు సాగునీరు అందించే చెరువులో పట్టా ఎలా ఇచ్చారన్నారు. పట్టాను రద్దు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు రైతులంతా లేఖ ఇచ్చినప్పటికీ ఎందుకు రద్దు చేయటం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య తెలియజేశారు. తహసీల్దార్ వచ్చి రైతులతో మాట్లాడారు. ఐదు దశాబ్దాల క్రితం ఇచ్చిన డీ పట్టాలో.. సదరు వ్యక్తి సాగు చేయకపోవటం వల్ల రద్దు చేసేందుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. రైతులు సహకరించడంతో సాయంత్రం భూ సర్వేను రెవెన్యూ సిబ్బంది ప్రారంభించారు.


నేడు భూ సర్వేపై సమావేశం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం గ్రామంలో భూ సర్వే సమావేశం ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించానున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కె.రవిచంద్ర శనివారం తెలిపారు. ప్రరాజపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు తమకు సంబంధించిన పాస్ బుక్‌లతోపాటు, ధ్రువపత్రాలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఇసుక ర్యాంపుపై ఫిర్యాదు

కొత్తూరు: మండంలోని ఆకులతంపర వద్ద వంశధార నదిలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపుపై మండలంలోని పారాపురం, గురండి పంచాయతీలతోపాటు పలువురు సర్పంచ్‌లు జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆకులతంపర వద్ద ఇసుక ర్యాంపు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతులు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇసుకను లారీల్లో స్థాయికి మించి అంగూరు-కలిగాం రోడ్డులో రాకపోకలు చేయడంతో గోతులుగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'కాకర' చిలుక



రామచిలుక ఆకారంలో ఉన్న కాకరకాయ

ఈ చిత్రం చూసేందుకు అచ్చం రామ చిలుకలా ఉంది. కానీ చిలుక కాదు.. ఇది కాకరకాయ. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన బంగారు ఆభరణాల తయారీదారుడు తూరుబాటి సూర్యారావు శనివారం బజారు వెళ్లి కూరగాయలు తీసుకువచ్చారు. అందులో చిలుక ఆకారంలో ఉన్న కాకరకాయ కనిపించింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. – సరుబుజ్జిలి

అభివృద్ధిపై మాట్లాడే హక్కు కలమటకు లేదు



మాట్లాడుతున్న రెడ్డి రామారావు, తదితరులు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజవర్గంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తన హయాంలో శాశ్వతంగా చెప్పుకునే అభివృద్ధి పని ఒక్కటైనా చేశారా? అని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాయలంలోని ఎంపీపీ చాంబర్‌లో శనివారం జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జెండాపై 2014 ఎన్నికల్లో గెలిచిన కలమట.. అభివృద్ధి పేరు చెప్పి 2016లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్నారు. పార్టీ ఫిరాయించిన తరువాత కలమట చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. మండలంలోని కడపలవానిగెడ్డి సమస్యలపై కలమట ఇప్పుడు స్పందించటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు కడపలవాని గెడ్డి, అక్కడి రైతుల సమస్యలు కనిపించలేదా అని ప్రశ్నించారు. స్వార్థ ప్రయోజనాలు కోసం పార్టీ ఫిరాయించిన కలమట.. ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిరంతరం తపిస్తున్నారని గుర్తుచేశారు. సీఎం జగనన్న పాలనలో ప్రతీ కుటుంబం ఆర్థికంగా చెందిందన్నారు. పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

18 క్షేత్రాల్లో భగవద్గీత పారాయణం

నరసన్నపేట: అధిక శ్రావణం(పురుషోత్తం మాసం)లో పురుషోత్తముడైన కృష్ణపరమాత్ముడి కోసం 18 క్షేత్రాల్లో భగవద్గీతను పారాయణం చేసేందుకు సంకల్పించినట్లు స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 29 మంది ఈ నెల రోజుల్లో వివిధ పుణ్య క్షేత్రాలకు వెళ్లి భగవద్గీత పారాయణం చేస్తారన్నారు. దీంట్లో భాగంగా శనివారం జి.సిగడాం మండలంలోని పనసలవలసలో భగవద్గీత పారాయణం చేయడం జరిగిందన్నారు. వచ్చే వారం శాలిహోండంలో నిర్వహిస్తామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేస్తామన్నారు.



భగవద్గీత పారాయణానికి బయలుదేరిన గీతా మందిరం సభ్యులు

పోలవరంపై టీడీపీది విషప్రచారం



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, బీజేపీలు చేస్తున్న విషప్రచారాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, ఎల్లో మీడియా పోలవరంపై చేస్తున్న విషప్రచారాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, అప్రోచ్ చానెల్, పైలెట్ చానల్‌లు నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించింది చంద్రబాబు ప్రభుత్వమేనని గుర్తుచేశారు. దీంతో డయాఫ్రమ్ వాల్ చాలా వరకు దెబ్బతిందని, అది తిరిగి నిర్మించేవరకు ప్రధాన రాక్ కమ్ ఎర్త్ ఫిల్ డ్యామ్ కట్టలేరన్నారు. చంద్రబాబు చేసిన ఈ తప్పిదం వల్ల ఈ రోజు పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతుందన్నారు. సీఎం జగన్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమం గతంలో ఎవ్వరూ చేయలేదన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సంక్షేమం ఎంతో ఉపయోగపడిందన్నారు. సుమారు 6 లక్షల మందిని ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తే.. ప్రతిపక్షాలకు అవి కనపడలేదని, ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా తీయలేదని బరితెగించి చంద్రబాబు, లోకేష్ మాట్లాడుతున్నారన్నారు. ప్రతీ పేదవాడికి ఈ ప్రభుత్వంలో లబ్ధి చేకూర్చిందన్నారు. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఎంతో ప్రాముఖ్యత గల విద్యారంగాన్ని సీఎం జగన్ ప్రక్షాళన చేశారన్నారు. ఈ విషయాలను పార్టీ నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావాడం యొక్క ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కార్యకర్తలు చిగురుపల్లి రవికుమార్, కొప్పల ఈశ్వరరావు, దానేటి రామమోహన్, గురుగుబెల్లి భాస్కర్, గిరి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ!

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస, అక్కివలస, వాంబేకాలనీ తదితర ప్రాంతాకు చెందిన గ్రామ దేవత చెవిటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు సమాచారం. సీసీ కెమెరాలు, హుండీ, అమ్మవారికి సంబంధించి వెండి నగలు చోరీకి గురైనట్లు ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఈ విషయమై ఆమదాలవలస పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ వై.కృష్ణ ఆలయానికి వెళ్లి పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన వ్యక్తులు ఇంతవరకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా చెరువులు, ఖాళీ స్థలాలు, స్కూళ్ల వద్ద ఫలసాయం వచ్చే మొక్కలు నాటుతున్నామని, ప్రతీ మొక్క సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తెలిపారు. మొదటి విడతగా 50 వేల మొక్కలు నాటుతున్నామన్నారు. మండలంలోని బొరిగివలసలో గల వెంకన్న చెరువు గట్టుపై కొబ్బరి, మునగ మొక్కలను శనివారం నాటారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో లక్ష మునగ మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నాటిన ప్రతీ మొక్క సక్రమంగా పెరగాలని సిబ్బందికి సూచించారు. ఒక్క మొక్క లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నరసన్నపేటకు మొదటి విడతగా 3100 మొక్కలు వచ్చాయన్నారు. మునగ మొక్కలు నాటడం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులకు మునగ పంటపై ప్రత్యేక అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, బగ్గ రమణయ్య, ఏపీఓ యుగంధర్, ఉపాధి మండల ఇంజినీర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పీడీ చిట్టిరాజు

భక్తిశ్రద్ధలతో హరేరామ సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం రామాలయంలో ఏకాదశి సందర్భంగా శనివారం 24 గంటలు హరేరామ, హరేకృష్ణ నామ సంకీర్తనలు భక్తులు ఆలపించారు. శనివారం ఉదయం ఆరు నుంచి ప్రారంభించి, ఆదివారం ఉదయం ఆరు గంటలకు వరకు భక్తులు సంకీర్తనలు నిర్వహించినట్లు ఆలయ సభ్యులు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.